సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం ׀ 25 ׀ నవంబర్ ׀ 2023



కమ్యూనిస్టులను అసెంబ్లీకి..
నిరంతరం ప్రజల మధ్య ఉండే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపాలని త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ పిలుపునిచ్చారు. 8లో



ఇది ఎన్నికల పేరంటం!
ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు తమ పార్టీ శ్రేణులకు భోజనాలు పెడుతుండటంతో కేటరింగ్‌కు డిమాండ్ పెరిగింది. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం
జిల్లాలో శనివారం వాతావరణం చల్లగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలతో రామయ్య దర్శనం..



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కనకదుర్గమ్మకు పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచ: మండలంలోని శ్రీకనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో శుక్రవారం అమ్మవారికి పంచామృతంతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకం జరిపారు. అనంతరం పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు చేశారు. ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయపాలకవర్గ సభ్యుడు గంధం వెంగళరావు, అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లోటుపాట్లు ఉండొద్దు

జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య



కేటీపీఎస్‌లో పనులను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ కర్మాగారంలో చేపడుతున్న పనుల్లో లోటుపాట్లు లేకుండా చూడాలని జెన్‌కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య సూచించారు. 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 11వ యూనిట్ ఓవరాల్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఉత్పత్తిని సకాలంలో అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీఈ ఎం.ప్రభాకర్ రావు, ఎస్ఈలు, డీఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.3.59 కోట్ల మద్యం సీజ్

కొత్తగూడెంఅర్బన్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి శుక్రవారం వరకు రూ.3.59 కోట్ల విలువైన మద్యం, గంజాయి, బెల్లం, వాహనాలను సీజ్ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి జానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3,470 లీటర్ల గుడుంబా, 2,17,980 లీటర్ల మద్యం, 1,060 కేజీల బెల్లం, 24,176 లీటర్ల బీరు, 21 సెల్‌ఫోన్లు, 44 వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు. 838 మందిపై కేసులు నమోదు చేశామని, 305 మందిని అరెస్టు చేశామని, 975 మందిని బైండోవర్ చేశామని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైట్‌హౌజ్ సమావేశానికి నల్లా సురేశ్‌రెడ్డి



పాల్వంచ: డిసెంబర్ 11వ తేదీన అమెరికాలోని వైట్ హౌజ్‌లో జరిగే సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన శ్యామల గోపాలన్ ఎడ్యుకేషన్ ఫౌండర్, చైర్మన్ నల్లా సురేశ్ పాల్గొననున్నారు. ఆ దేశ వైస్ ప్రెసిడెంట్ కమలా హారీస్ ఈవెంట్ నిర్వహిస్తుండగా పలువురిని ఆహ్వానించారు. ఇందులో భాగంగా తనకు ఆహ్వానం అందిందని సురేష్ తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో కూడా కమలా హారీస్‌తో ఆయన భేటీ అయ్యారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు

చరమగీతం పాడాలి



రైల్వే స్టేషన్ ఎదుట నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు, సీపీఐ, కాంగ్రెస్ కార్యకర్తలు

అమిత్ షాను బతిమిలాడి కవితపై లిక్కర్ కేసు మాఫీ

- ఓటమి భయంతోనే కాంగ్రెస్ అభ్యర్థుల ఇళ్లపై ఐటీ దాడులు
- సింగరేణి ప్రైవేటీకరణకు రెండు పార్టీల కుట్ర
- కార్నర్ మీటింగ్‌లో సీపీఐ, కాంగ్రెస్ అగ్రనేతలు



మాట్లాడుతున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, పక్కన సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా, కొత్తగూడెం అభ్యర్థి కూనంనేని తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/కొత్తగూడెంరూరల్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలకు చరమగీతం పాడాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం కొత్తగూడెంలోని రైల్వే స్టేషన్ ముందు కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన సీపీఐ జాతీయ కార్యదర్శులు అజీజ్‌పాష, నారాయణ, కాంగ్రెస్ శాసనసభా పక్షనేత మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టేనని తెలిపిన ఆయన కొత్తగూడెంలో కాంగ్రెస్ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును గెలిపించాలని కోరారు. ఇదే సమయంలో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిని జలగం వెంకటరావును ఉద్దేశించి 'పార్టీ గుర్తు తల్లి వంటిదని, కానీ వేరే పార్టీకి డబ్బు ఇచ్చి గుర్తు తెచ్చుకున్న వెంకటరావు.. మాజీ సీఎం జలగం వెంగళరావు కడుపున చెడపుట్టాడు' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

అదానీ, అంబానీల కోసమే మోదీ..

సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటూ గద్దెనెక్కిన నరేంద్రమోదీ గడిచిన పదేళ్లలో అంబానీ, అదానీ, టాటా, బిర్లాల వికాసం కోసమే పని చేస్తున్నారని, మోదీ మరోసారి అధికారంలోకి వస్తే సింగరేణి సంస్థను అదానీకి కట్టబెట్టడం ఖాయమని విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ దొంగలేనని, ఆ పార్టీలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ కేంద్ర మంత్రి అమిత్‌షా కాళ్లు మొక్కి తన కూతురు కవితను లిక్కర్ స్కామ్‌లో జైలుకు పోకుండా కాపాడుకున్నారని అన్నారు. ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ బీజేపీతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థుల ఇళ్లపై ఐటీ దాడులు చేయిస్తోందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని, ఆ పార్టీని బంగాళాఖాతంలో కలవడం ఖాయమని అన్నారు. ఆడపిల్లను ఒక ఇంటికి ఇచ్చే సమయంలో తల్లిదండ్రులుగా ఏవిధంగా ఆలోచిస్తామో, ఓటు వేసే సమయంలోనూ అదేవిధంగా ఆలోచించాలన్నారు.

వనమాతో జాగ్రత్త

వనమా వెంకటేశ్వరరావు ఎవరి ఇంటికైనా వస్తే జాగ్రత్త పడాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ఇచ్చే డబ్బులు తీసుకుని కాంగ్రెస్ మద్దతు ఇస్తున్న సీపీఐకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా ఈ కార్నర్ మీటింగ్‌కు కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకాగాంధీ హాజరుకావాల్సి ఉండగా, చివరి నిమిషంలో ఆమె పర్యటన రద్దయింది.

జలగంది కార్పొరేట్ దందా : కూనంనేని

చందా..దందా లేని పాలన అందిస్తానని గొప్పలు చెబుతున్న జలగం వెంకట్రావుది కార్పొరేట్ దందా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కరోనా కష్టకాలంలో జలగం కనిపించలేదని, సమస్యలను వాట్సప్‌లో పంపించాలని చెప్పే ఆయనకు, ప్రజలు ఓట్లు కూడా వాట్సప్‌లోనే వేయాలని పేర్కొన్నారు. కంకర మిల్లులు మూసివేయించి, చందాలు తీసుకొని తెరిపిస్తారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, అతని కొడుకు చెప్పిన మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాష, టీపీసీసీ మెంబర్ నాగ సీతారాములు, జిల్లా కాంగ్రెస్ నాయకులు తూముచౌదరి, ఆళ్లమురళి, నూకల రంగారావు, దేవీప్రసన్న పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న జీఎం శాలెంరాజు

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో సింగరేణి జీఎం శాలెంరాజు

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని.. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు తెలిపారు. కొత్తగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సాంకేతిక విద్య విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వంటిదని తెలిపారు. పాలిటెక్నిక్ చదివిన వారు అనేక మంది సింగరేణిలో ఉన్నత స్థానాలకు చేరుకున్నారని చెప్పారు. క్రీడాపోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి భవిష్యత్ విజయాలకు సోపానాలుగా మలుచుకోవాలని సూచించచారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని తొమ్మిది కళాశాలలకు చెందిన 400 మంది విద్యార్థులకు హాజరుకాగా, అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

మణుగూరు రూరల్ : పినపాక నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

తెప్పోత్సవ ఏర్పాట్లు పరిశీలన



గోదావరి వద్ద పరిశీలిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాలలో ముక్కోటి తెప్పోత్సవం ఏర్పాట్లను ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు రెడ్డి, సీఐ దోమల రమేష్ శుక్రవారం పరిశీలించారు. వచ్చే నెల 23న జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని గోదావరి నదిలో తెప్పోత్సవ నిర్వహించనున్నారు. గోదావరిలో సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలోని కాంక్రీట్ గోడకు అవతల తెప్పోత్సవం నిర్వహించేలా అధికారులు సూచన ప్రాయంగా అంగీకరించారు. కట్టకు దగ్గరలో సుమారు నది లోతు 15 అడుగుల మేర ఉంటుందని ఎస్ఈ తెలిపారు. అధికారులు రాంప్రసాద్, మధుసూదన్ రావు, పవన్ కుమార్, ప్రసాద్ రెడ్డి, రవీంద్ర పాల్గొన్నారు.

హోం ఓటింగ్.. 701

- మరో 65 మందికి నేడు పోలింగ్‌కు సన్నాహాలు
- తొలిరోజు పోస్టల్ బ్యాలెట్లు 939

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో హోం ఓటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. 80 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఈసారి ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియను గత మంగళవారం ప్రారంభించగా, శుక్రవారం వరకు 701 ఓట్ల పోలింగ్ పూర్తి చేశారు. బీఎల్ఓల ద్వారా దరఖాస్తు చేసుకున్న 484 మంది వయోవృద్ధులు, 241 మంది దివ్యాంగులు, ఎసెన్షియల్ ఆల్ సర్వీస్ ఓటర్లు 41 మంది... మొత్తం 766 మందికి ఈ అవకాశం కల్పించారు. వీరిలో ఇప్పటికే 701 మంది హోం ఓటింగ్ పూర్తి కాగా, మిగిలిన 65 మందితో శనివారం పోలింగ్ ముగించేలా ప్రణాళిక రూపొందించారు. ఈసారి ఎన్నికలలో ఫారం -12డీ ద్వారా హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించామని, పటిష్ట బందోబస్తు, వీడియోగ్రఫీ మధ్య ఓటుహక్కు వినియోగానికి చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల పేర్కొన్నారు. శనివారంతో ఈ ప్రక్రియ ముగుస్తుందని అన్నారు.

ఎపిక్ కార్డుల పంపిణీ పూర్తి

జిల్లాలోని ఓటర్లకు ఎపిక్ కార్డుల పంపిణీ ప్రక్రియ పూర్తయింది. రెండు రోజుల క్రితం వరకు 451 కార్డులు పంపిణీ మిగిలిపోగా బీఎల్ఓల ద్వారా 440 కార్డులను పంపిణీ చేయించారు. ఇచ్చిన చిరునామాలో నివాసం ఉండని కారణంగా మరో 11 కార్డులు పంపిణీ చేయలేకపోయామని జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా పూర్తి చేశారు. ఈసారి ఓటరు స్లిప్పులో బార్‌కోడ్‌ను పొందుపర్చారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రారంభం

పోలింగ్ విధులు కేటాయించిన సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభంకాగా, ఈ నెల 28 వరకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లోని ఫెసిలిటేషన్ కేంద్రాల్లో కొనసాగనుంది. తొలి రోజు జిల్లాలో939 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. పినపాక నియోజకవర్గంలో 308 మంది, ఇల్లెందులో 118, కొత్తగూడెంలో 211, అశ్వారావుపేటలో 221 మంది, భద్రాచలంలో 81 మంది ఓటు వేశారు.

కమీషనింగ్ జాగ్రత్తగా జరపాలి

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక



ఈవీఎంల కమీషనింగ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

ఇల్లెందు/కొత్తగూడెంరూరల్ : ఈవీఎంల కమీషనింగ్ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల సూచించారు. శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో, ఇల్లెందు సింగరేణి హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఈవీఎంలు, వీవీప్యాట్ల కమీషనింగ్ ప్రకియను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు కేటాయించామన్నారు. కమీషనింగ్‌లో సీరియల్ నంబర్లు, అభ్యర్థుల పేర్ల కేటాయించిన గుర్తులు ఏర్పాటు ప్రక్రియను రికార్డు చేశామని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించామని వివరించారు. ఈ నెల 29న పోలింగ్ మెటీరియల్ పంపిణీ జరగనుందని, రిసెప్షన్ కేంద్రం వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇల్లెందులో ఆశించినరీతిలో కమీషనింగ్ ప్రక్రియ జరగడం లేదని, వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. కొత్తగూడెం, ఇల్లెందు రిటర్నింగ్ అధికారులు శిరీష, కాశయ్య, ఇతర అధికారులు పుల్లయ్య, రవికుమార్, నాగరాజు, వివిధ పార్టీల ప్రతినిధులు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.

అదనంగా ఈవీఎంల కేటాయింపు

కమీషనింగ్ ప్రక్రియలో సమస్యలు గుర్తించి, అదనంగా 312 ఈవీఎంలను ఆయా నియోజకవర్గాలకు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పినపాకకు 68, ఇల్లెందుకు 75,కొత్తగూడేనికి 113, భద్రాచలం 26 చొప్పున అందించారు. శుక్రవారం రాత్రి ఆమె ఈవీఎంల గోదాంను సందర్శించి, ఈ మేరకు కేటాయింపులు చేపట్టారు.

మణుగూరులో...


మణుగూరు రూరల్: ఈ నెల 30న రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశారు. శుక్రవారం అక్కడ ఈవీఎం, వీవీప్యాట్ల కమీషనింగ్ ప్రక్రియ నిర్వహించగా, భద్రాచలం ఐటీడీఏ పీఓ, పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ పర్యవేక్షించారు. ఈసీఐఎల్ ఇంజనీర్లసాయంతో ఈవీఎంల సన్నద్ధం, బ్యాలెట్ పేపర్ లోడింగ్, అభ్యర్థుల సెట్టింగ్ నిర్వహించారు. అధికారులు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధన మెరుగుపర్చుకోవాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి

టేకులపల్లి: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, బోధన మెరుగుపర్చుకోవాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని మద్దిరాల తండా , సుక్కాల బోడు ప్రాథమిక , టేకులపల్లి ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో అటెండన్స్ సక్రమంగా తీసుకోకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 4, 5 తరగతుల విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా మారి ఎప్పటికప్పుడు జ్ఞానాన్ని సముపార్జించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఎస్‌కే.సైదులు, ఠాకూర్ రాంసింగ్, శ్రీనివాస్‌రావు, రమేష్, నరేష్, భాస్కర్, నాగేశ్వరరావు, బాణోతు భాస్కర్‌రావు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



విజేతలతో పోటీల నిర్వాహకులు

కొత్తగూడెంటౌన్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో కొత్తగూడేనికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి కొట్టె సాయిశ్రీవాత్సవ్, సెయింట్ జోసఫ్ స్కూల్ విద్యార్థి ఛత్రపతి కాంస్య పతకాలు సాధించారు. సాయిశ్రీ వాత్సవ్‌ను ప్రిన్సిపాల్ ఎం.వి శ్రీనివాసరెడ్డి, ఛత్రపతిని స్విమ్మింగ్ పూల్ కోచ్ సామ్యూల్, రాంబాబు, సంధ్య, హనుంతరాజు, సామంతులు తదితరులు శుక్రవారం అభినందించారు..

పోలింగ్ కేంద్రాలపై నిఘా!



ఎప్పుడైనా, ఎక్కడ నుంచైనా పరిశీలనకు వీలు

- అధికారులకు సులభం కానున్న పర్యవేక్షణ
- అన్ని కేంద్రాలను జియోట్యాగింగ్ చేసిన అధికారులు
- ఉమ్మడి జిల్లాలో పోలింగ్ కేంద్రాలు 2,554
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

వైరా: అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు స్లిప్‌లు, గుర్తింపు కార్డుల పంపిణీ చివరి దశకు చేరగా... పోలింగ్ సమీపిస్తున్న వేళ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే జిల్లాలో అన్ని పోలింగ్ స్టేషన్లను జియో ట్యాగింగ్ చేశారు. దీనికి కోసం లాంగిట్యూడ్, లాటిట్యూడ్ ప్రక్రియ పూర్తయింది. తద్వారా రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా ఏ పోలింగ్ స్టేషన్‌లో జరిగే పోలింగ్ సరళినైనా అధికారులు పరిశీలించే వెసలుబాటు కలగనుంది. జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాలే కాకుండా మారుమూల గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లు జియో ట్యాగింగ్ కూడా పూర్తి చేయడం విశేషం. ఇందుకోసం ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో ఉన్న పోలింగ్ స్టేషన్‌ల ఛాయా చిత్రాలను పోలీసులు సేకరించి జియో ట్యాగింగ్ చేశారు. తద్వారా పోలింగ్ స్టేషన్ ఆవరణలో ఏవైనా అనుకోని సంఘటనలు, గొడవలు జరిగితే రాష్ట్ర, జిల్లా స్థాయిలో తక్షణమే గుర్తించి నష్టనివారణ చర్యలు చేపట్టడం వీలవుతుందని చెబుతున్నారు.

పకడ్బందీగా నిర్వహణకు..

పోలింగ్ ఈనెల 30న జరుగనున్న నేపథ్యంలో పోలీస్ శాఖ ముందుచూపుతో వ్యవహరిస్తోంది. జిల్లాలోని సున్నితమైన ప్రాంతాలు, అత్యంత సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించారు. అలాగే, జిల్లాకు చేరుకున్న ప్రత్యేక బలగాలతో ఆయా ప్రాంతాల ప్రజలకు భరోసా కల్పించేలా కవాతు నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల సమయాన ఎక్కడెక్కడ పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు జరిగాయో గుర్తించి.. ఆయా కేంద్రాల అదనపు బలగాలను రంగంలోకి దించాలని నిర్ణయించారు.

పాత నేరస్తులపై నిఘా

అన్నిపోలింగ్ కేంద్రాలను జియో ట్యాగింగ్ చేయడంతో పాటుగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న పాత నేరస్తులు, హిస్టరీ షీట్స్ ఉన్న వ్యక్తులు, నియోజకర్గ పరిధిలో ఉన్న పాత నేరస్తులను వారందరినీ బైండోవర్ చేస్తున్నారు. కొత్తగా వారిపై ఏమైనా కేసులు నమోదయ్యాయి, ఎక్కడెక్కడకు వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారనే అంశంపై నిఘా వేశారు.

సీసీ కెమెరాలు కూడా..

ఎన్నికల సందర్భంగా పోలీస్‌శాఖ గట్టి బందోబస్తులో పాటు పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ పోలింగ్ స్టేషన్‌ను జియో ట్యాగింగ్ చేశారు. అలాగే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించేంచనున్నారు. పోలింగ్ కేంద్రాలను జియో ట్యాగింగ్ చేశాక మండల పోలీసుస్టేషన్‌కు అనుసంధానించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. తద్వారా ప్రతీ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని ఇటు జిల్లా, అటు రాష్ట్ర స్థాయి అధికారులు అనునిత్యం పర్యవేక్షించడం సాధ్యమవుతుంది.

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు
పినపాక	244
ఇల్లెందు	241
ఖమ్మం	355
పాలేరు	289
మధిర	268
వైరా	252
సత్తుపల్లి	292
కొత్తగూడెం	253
అశ్వారావుపేట	184
భద్రాచలం	176
మొత్తం	2,554

ఇది ఎన్నికల పేరంటం!

ఓ వైపు శుభకార్యాలు.. మరోవైపు ఎన్నికల ప్రచారంతో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. పెళ్లి ముహూర్తాలు ఉన్న సమయంలో ఎన్నికలు వచ్చాయి. ఆగస్టు నుంచి ప్రారంభమైన వివాహ ముహూర్తాలు డిసెంబర్ వరకు ఉండగా.. అత్యధిక ముహూర్తాలు నవంబర్‌లో ఉన్నాయి. ఇదేసమయాన ఎన్నికల హడావుడి నెలకొనడం... మరోవైపు అయ్యప్ప మాల ధారణ చేసిన భక్తులకు భిక్ష ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇవన్నీ కలిపి క్యాటరింగ్ వ్యవస్థకు డిమాండ్ తీసుకొచ్చాయి. - ఖమ్మంగాంధీచౌక్

అసెంబ్లీ ఎన్నికల వేళ క్యాటరింగ్‌కు డిమాండ్

- నాయకులు, కార్యకర్తలకు టిఫిన్, భోజనం సమకూర్చేలా ఒప్పందాలు
- కొందరి కార్యాలయాల్లోనే వంటల తయారీ
- ఆర్డర్లపై సిద్ధం చేయిస్తున్న మరికొందరు
- చేయి తిప్పుకోలేని విధంగా నిర్వాహకుల బిజీబిజీ


భోజనాలు సిద్ధం చేస్తున్న మేస్త్రీలు

అల్పాహారం, భోజనాలు

రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గెలుపే లక్ష్యంగా ఎంతటి ఖర్చుకైనా వెనుకాడడం లేదు. నిత్యం ప్రచారంలో నిమగ్నమవుతున్న అభ్యర్థుల వెంట పదుల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నారు. వీరందరికీ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను అభ్యర్థులే సమకూరుస్తున్నారు. ఇక జెండాలు పట్టుకొని ప్రచారానికి వచ్చేవారికి మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. గ్రామ స్థాయి మొదలు మండల, పట్టణ స్థాయి వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుండగా.... ఆర్డర్ల మేరకు క్యాటరింగ్ నిర్వాహకులు సమయానికి వాహనాల్లో ఆహారాన్ని అందుబాటులో ఉంచుతున్నారు.

భలే డిమాండ్

శుభకార్యాల సమయంలోనే ఎన్నికలు రావడంతో క్యాటరింగ్ నిర్వహకులకు డిమాండ్ పెరిగింది. బోజనాల్లో వెరైటీల ఆధారంగా ప్లేట్‌కు రూ.150 నుంచి రూ.250 వరకు, టిఫిన్లు రూ.100, స్నాక్స్ రూ.50 చొప్పున చెల్లిస్తున్నారు. ఇక మాంసాహారమైతే అదనంగా వసూలు చేస్తున్నారు. ఆర్డర్ల ఆధారంగా ముందు రోజు వంట సామాగ్రి సమకూర్చుకుని, అవసరమైన మనుషులను సిద్ధం చేసుకుంటున్నారు. ఖమ్మంలో ఉన్న క్యాటరింగ్ నిర్వాహకులకు పాలేరు, వైరా, మధిర, కోదాడ, డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. కొందరు అభ్యర్థులు వారి కార్యాలయాల్లో వంటలు సిద్ధం చేయిస్తుండగా.. మరికొందరు సమయానికి వారు ఉన్న చోటకు చేర్చేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

మునుపెన్నడూ ఇలా లేదు..



ఓవైపు శుభకార్యాలు, మరోవైపు ప్రచారంతో క్యాటరింగ్‌కు డిమాండ్ పెరిగింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఆర్డర్లు వస్తున్నాయి. ఈనెల 30వ తేదీ వరకు ముందుగానే బుక్ అయ్యాయి. అల్పాహారం మొదలు భోజనాలు, స్నాక్స్ సమకూరుస్తున్నాం.
– వంగవీటి శబరీనాథ్, క్యాటరింగ్ నిర్వాహకులు, ఖమ్మం

ఆర్డర్ల మేరకు వంటలు



ఆర్డర్ మేరకు సామగ్రి సమకూర్చుని పని వారిని తీసుకుంటున్నాం. ప్రచారం మొదలైనప్పటి నుంచి నిర్విరామంగా వంట పనులు చేస్తున్నాం. అల్పాహారం మొదలు శాఖాహార, మాంసాహార వంట తయారుచేస్తున్నాం. ఈ నెల మొత్తం ఉపాధికి ఢోకా లేదు.
– శ్రావణ్, వంట మేస్త్రీ, శ్రీనివాసనగర్, ఖమ్మం

నిత్యం పని లభిస్తోంది..



కొద్దిరోజులుగా నిత్యం పని ఉంటోంది. గతంలో శుభకార్యాలు ఉన్నప్పుడు పనికి పిలిచేవారు. మిగతా సమయాన ఇతర పని చేసేవాళ్లం. కానీ ఇప్పుడు ఎన్నికలు రావడంతో ప్రతిరోజు పని లభిస్తోంది. డిమాండ్‌కు తగ్గట్లు రూ.వెయ్యి కూడా ఇస్తున్నారు.
– వొగ్గు సుగుణమ్మ, కాల్వొడ్డు, ఖమ్మం

ఉపాధి పెరిగింది..



40ఏళ్లుగా వంట పనిచేస్తున్నా. తొలినాళ్లలో భోజనం పెట్టి కొంత కూలీ పెట్టేవారు. ఆ తరువాత కూలీ రూ.40కు చేరింది. అయినా నిత్యం పని లభించేది కాదు. ఇప్పుడు నిత్యం పని దొరకడమే కాక రోజుకు రూ.600 నుంచి రూ.700 కూలీ అందుతోంది. – బింగి సోమమ్మ, పంపింగ్‌వెల్ రోడ్, ఖమ్మం

పెరిగిన ఉపాధి

శుభకార్యాలు, ఎన్నికలు ఒకేసారి రావటంతో వంట మేస్త్రీలకు, సహాయకులకు ఉపాధి పెరిగింది. గతంలో శుభకార్యం ఉన్న సమయంలోనే ఉపాధి లభించేది. ప్రస్తుతం నవంబర్‌లో అటు శుభకార్యాలు, ఇటు ఎన్నికల హడావుడి ఉండడంతో ఉపాధికి ఢోకా లేకుండా పోయింది. వంట మేస్త్రీలకు వంటల్లో వెరైటీల ఆధారంగా రోజుకు రూ.2 వేల వరకు, సహాయకులకు రూ.వెయ్యి, ఇతర కూలీలకు రూ.700 వరకు క్యాటరింగ్ నిర్వాహకులు చెల్లిస్తున్నారు.


ఇతర పనుల్లో నిమగ్నమైన సహాయకులు

బీజేపీ.. తెలుగు రాష్ట్రాలకు శత్రువు

- బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంది లోపాయికారీ ఒప్పందం
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రెండు తెలుగు రాష్ట్రాలకు శత్రువు అని.. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులనూ ఇవ్వడం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు విడిపోయాక విభజన చట్టంలోని అంశాల్లో ఏది కూడా బీజేపీ అమలు చేయలేదన్నారు. మోదీ పాలన ఆసాంతం నేర ఆలోచనతో సాగుతూ.. ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడం, రాజ్యాంగసంస్థలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఉందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించడమే లక్ష్యంగా సీపీఐ పనిచేస్తూ ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉందని.. అందుకే ఒక్క స్థానమే అయినా కాంగ్రెస్‌తో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం నడుమ లోపాయికారీ ఒప్పందం ఉండడంతోనే రాజాసింగ్‌పై ఎంఐఎం పోటీ పెట్టలేదని నారాయణ చెప్పారు. ఒకప్పుడు బీజేపీకి వ్యతిరేకంగా కేసీఆర్ పనిచేయడంతో మునుగోడులో మద్దతు ఇచ్చినా... ఆయన కుమార్తె కేసు తర్వాత వైఖరి మారిందన్నారు. కాగా, ఇప్పుడు జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ నాలుగింట ఓడిపోతుందని నారాయణ అభిప్రాయపడ్డారు. అటవీ సంరక్షణ చట్టాన్ని మార్చి ఆదివాసీలను బయటకు పంపే ప్రయత్నం జరుగుతుందని తద్వారా అటవీ సంపద కార్పొరేట్లకు అప్పగించాలనే కుట్ర ఉందని తెలిపారు. కాగా, ఏపీలో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ టీడీపీకి బీజేపీకి మధ్యవర్తిత్వం చేస్తున్నాడని.. అక్కడ మూడు పార్టీలు కలిస్తే జగన్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని నారాయణ వెల్లడించారు. ఆ రాష్ట్రంలో ముస్లిం, మైనారిటీలంతా వైఎస్సార్‌టీపీ వైపే ఉంటారన్నారు. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ గెలుపునకు సీపీఐ కృషి చేస్తుందని.. ఖమ్మంలో సీపీఐ నేత పువ్వాడ నాగేశ్వరరావు కొడుకు అజయ్ పోటీలో ఉన్నంత మాత్రాన తమ మద్దతు ఉండదని, అది అపోహ మాత్రమేనని నారాయణ స్పష్టం చేశారు. ఈమేరకు సీపీఐ శ్రేణులు మిత్రధర్మాన్ని పాటిస్తూ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు అజీజాపాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, మహ్మ ద్ మౌలానా, జమ్ముల జితేందర్ రెడ్డి, బీ.జీ.క్లెమెంట్, చామకూరి వెంకటనారా యణ, ఎస్.కే.జానీమియా, మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ పొలిటికల్ వింగ్ జాతీయ అధ్యక్షుడిగా కరుణాకర్

సత్తుపల్లిటౌన్: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్(ఎన్‌సీసీ) జాతీయ పొలిటికల్ వింగ్ అధ్యక్షుడిగా సత్తుపల్లికి చెందిన అలవాల కరుణాకర్ నియమితులయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఎన్‌సీఈసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన నియామకాన్ని ఎన్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌పాల్ ప్రకటించారు. ఈకార్యక్రమంలో నంబూరి జయదేవ్‌పింగలి సామేలు, హనోక్, రాజు, దేవసహాయం, బాలస్వామి, ఏసుదాసు, బిషప్, జేమ్స్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎన్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌పాల్ తదితరులు

జంగ్ తెలంగాణ

అభిమానంతో ప్రచారం



ఫించన్ అందిస్తున్న ప్రభుత్వ రుణం కొంతైనా తీర్చుకోవాలని కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన దివ్యాంగుడు ఐతనబోయిన వెంకటేశ్వర్లు నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియ ఫొటోతో తన మూడు చక్రాల వాహనం ద్వారా ప్రచారం చేస్తున్నాడు. - కామేపల్లి

'కారు' కోసం సైకిల్‌పై!

ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ కార్యకర్త కుక్కల కృష్ణ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాడు. సైకిల్‌పై నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తున్నాడు. పువ్వాడ కటౌట్, కారు గుర్తు పెట్టుకుని ప్రజలను కలుస్తూ పువ్వాడను గెలిపించాలని అభ్యర్థిస్తున్నాడు.
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్



క్లుప్తంగా

రామయ్య సేవలో హ్యూమన్‌రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్


ఆలయంలో చైర్‌పర్సన్ సీతారామమూర్తి

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని శుక్రవారం ఏపీకి చెందిన హ్యూమన్‌రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ మందాట సీతారామమూర్తి దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నాక ఉపాలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా పండితులు వేదాశీర్వచనం అందచేశారు. అలాగే, భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడెపూడి రామచంద్రయాదవ్ కూడా స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబు, అర్చకులు పాల్గొన్నారు.

మావోయిస్టులు ఆదివాసీలను బెదిరిస్తున్నారు

ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: మాట వినకుంటే గ్రామాలను ఖాళీ చేయాలంటూ ఆదివాసీలపై మావోయిస్టుల బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మావోయిస్టులు భౌతిక, మానసిక దాడులకు పాల్పడుతుండటంతో అమాయక ఆదివాసీలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ధర్మారాం చింతవాగు దగ్గర ప్రెషర్ బాంబు పెట్టడంతో ఓ ఆదివాసీ తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. ఇటీవలు ఆవు, అటవీ జంతువులు కూడా మృతి చెందాయని పేర్కొన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అడవుల్లో ప్రెషర్ బాంబులను, బూబీట్రాప్స్ అమర్చుతున్నారని ఆరోపించారు. వ్యాపారులను, ఆదివాసీలను బెదిరించి నిత్యవసరాలు, డబ్బులు వసూళ్ల చేస్తున్నారని, మాటవినని వారిని ఇన్‌ఫార్మర్ నెపంతో చంపుతున్నారని అన్నారు. ఆదివాసీల పట్ల మావోయిస్టులు వ్యవహరిస్తున్న తీరును ఆదివాసీ సంఘాలు, పౌరసంఘాలు, ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు ఖండించాలని కోరారు.

27న సిమ్మింగ్ ఎంపిక పోటీలు

సింగరేణి(కొత్తగూడెం): సికింద్రాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టును ఈనెల 27న ఎంపిక చేయనున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.హన్మంతరావు తెలిపారు. కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్‌లో 27వ తేదీన సాయంత్రం 3 నుండి 4 గంటల వరకు ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వివరాల కోసం 98669 23395, 99080 53539 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపించండి

- తద్వారా ప్రజాసమస్యలపై చర్చ, పరిష్కారం
- త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్


కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాణిక్ సర్కార్, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్ : నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను గుర్తించే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపించాలని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు మాణిక్ సర్కార్ పిలుపునిచ్చారు. తద్వారా అసెంబ్లీలో ప్రజాసమస్యలపై చర్చించి పరిష్కారానికి పాటుపడతారని తెలిపారు. ఖమ్మంలోని త్రీటౌన్ ప్రాంతంలో సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బోస్‌బొమ్మ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాణిక్ సర్కార్ మాట్లాడుతూ వ్యవసాయదారులు, కూలీలు, కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు చేసిన బీజేపీని ఓడించాలనే నినాదంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని.. ప్రజలపై భారాలు వేయడంలో ఆ రెండు పార్టీలు సమానమేనని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ సీపీఎం ప్రజలను నమ్మితే.. ఇతర పార్టీలు డబ్బులు నమ్ముకున్నాయని ఎద్దేవా చేశారు. అయితే, ఎన్నికల వేళ డబ్బులు ఇస్తున్నా, గెలిచాక అంతకు మించి లాక్కుంటారని తెలిపారు.

దుర్మార్గంగా బీజేపీ తీరు

ముదిగొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గంగా ఉండడంతో ఏ వర్గం ప్రజలకూ న్యాయం జరగడం లేదని త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ విమర్శించారు. మధిర సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్‌ను గెలిపించాలని కోరుతూ ముదిగొండలో శుక్రవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న బీజేపీ ఆ హామీని విస్మరించిందని ఆరోపించారు.

రాష్ట్రంలోనూ బీఆర్ఎస్ నేతృత్వాన అదే పరిస్థితి ఉందని చెప్పారు. ఈనేపథ్యాన చట్టసభల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.సాయిబాబా, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు వై.విక్రమ్, యల్లంపల్లి వెంకట్రావు, యర్రా గోపి, భూక్యా శ్రీనివాస్, బండారు యాకయ్య, బండారు రమేష్, వజినేపల్లి శ్రీనివాస్, ఎం.ఏ.జబ్బార్, నవీన్ రెడ్డి, పొన్నం వెంకటేశ్వరరావు, జె.వెంకటేష్, బండి పద్మ, వాసిరెడ్డి ప్రసాద్, భట్టు పురుషోత్తం, మంకెన దామోదర్ కోలేటి అరుణ, కొండమీది సువార్త తదితరులు పాల్గొన్నారు.

'కాకతీయ షుగర్స్' తీరు సరికాదు

చెరుకు రైతుల ఆవేదన


వివరాలు వెల్లడిస్తున్న చెరుకు సాగుదారులు

అశ్వారావుపేటరూరల్: చెరుకు రైతుల పట్ల కల్లూరులోని కాకతీయ షుగర్స్ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు సరికాదని అశ్వారావుపేటకు చెందిన పలువురు చెరుకు సాగుదారులు పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గడిచిన నాలుగేళ్లుగా అశ్వారావుపేట ప్రాంతంలో సాగు చేస్తున్న చెరుకు పంటను రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్స్‌కు తరలిస్తున్నామని, ఇతర ఫ్యాక్టరీలతో పోల్చితే మధుకాన్ ద్వారా ఎకరాకు రూ. 6 వేల నుంచి రూ. 8 వేల వరకు లాభం వస్తుందని వివరించారు. కానీ కాకతీయ ఫ్యాక్టరీ యాజమాన్యం ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా రైతుల నుంచి అగ్రిమెంట్ పేపర్లపై సంతకాలు తీసుకుని, మధుకాన్ ఫ్యాక్టరీకి వెళ్తున్న చెరుకు లారీలను నిలిపివేసి, డ్రైవర్లను భయాందోళనకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. గిట్టుబాటు ధర, ప్రోత్సహకాలు అందించే మధుకాన్ ఫ్యాక్టరీకే చెరుకు సరఫరా చేస్తామని తేల్చి చెప్పారు. రైతులు ముళ్లపూడి శ్రీనివాసరావు, చిన్నంశెట్టి శ్రీను, చిన్నంశెట్టి రాంబాబు, మెట్టా తులసీరావు, కామేష్, మూల నాగేంద్ర, కొత్త ప్రవీణ్ పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్ మోతాదు పెరిగితే అనర్థాలు

ఖమ్మం వైద్యవిభాగం: వైద్యులు సూచించిన మేరకు మాత్రమే యాంటీ బయాటిక్ మందులు వాడాలని, అంతకు మించి వినియోగిస్తే అనర్థాలు ఎదురవుతాయని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, డీసీహెచ్ఎస్ బి.వెంకటేశ్వర్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబయల్స్ రెసిస్టెన్స్ అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సూపరింటెండెంట్, డీసీహెచ్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అవసరం లేకుండా, వైద్యుల సూచన లేకుండా యాంటీ బయాటిక్ మందులు వినియోగించవద్దని సూచించారు. అనంతరం విద్యార్థులు స్కిట్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓలు బి.శ్రీనివాసరావు, రాంబాబు, అమర్‌సింగ్, ప్రొఫెసర్లు సరిత, సౌమ్య, బాబు రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, లారీ ఢీ : ఒకరికి గాయాలు

టేకులపల్లి: ఆటో, లారీ ఢీకొని ఒకరు గాయపడ్డ సంఘటన మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు శుక్రవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... సులానగర్ గ్రామానికి చెందిన బోడ హరి శుక్రవారం రాత్రి తన ఆటో నడుపుకుంటూ టేకులపల్లి నుంచి స్వగ్రామం వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొత్తగూడెం నుంచి టేకులపల్లి వైపునకు వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో హరి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు.

సాంకేతిక లోపంతో తెరుచుకోని రైల్వేగేట్

కారేపల్లి: కారేపల్లి–ఇల్లెందు నడుమ 2కేకే రైల్వే గేట్ వద్ద సాంకేతిక సమస్య తలెత్తడంతో శుక్రవారం వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గేట్ వేశాక సమస్య తలెత్తగా మళ్లీ తెరుచుకోలేదు. దీంతో గంటపాటు వాహనదారులు రెండు వైపులా నిలిచిపోవాల్సి వచ్చింది. చివరకు రైల్వే ఉద్యోగులు చేరుకుని మరమ్మతు చేశాక రాకపోకలుమొదలయ్యాయి. కాగా, 2కేకే గేట్ వద్ద తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నందున అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

108 వాహనంలో ప్రసవం


తల్లీ బిడ్డలతో 108 వాహన సిబ్బంది

ములకలపల్లి : 108 వాహనంలో మహిళ ప్రసవించి, పండంటి పాపకు జన్మనిచ్చింది. మండల పరిధిలోని చింతలపాడు గ్రామానికి చెందిన గర్భిణి సోడె లక్ష్మికి గురువారం అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో అంబులెన్స్‌లో పాల్వంచ ఆస్పత్రికి తరలిస్తున్నారు. మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో 108 ఈఎంటీ దుర్గాభవాని, పైలట్ తిరుపతి కాన్పు చేశారు. లక్ష్మికి ఆడపిల్ల జన్మించగా, తల్లీబిడ్డలు ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

దమ్మపేట: ఓ వృద్ధురాలు క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని జలవాగు గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మి (82) మద్యం తాగేందుకు గురువారం తన కుమారుడు వెంకటేశ్వరరావును డబ్బులు అడిగింది. అతను ఇవ్వకపోవడంతో క్షణికావేశంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఇల్లెందులో మరొకరు..

ఇల్లెందు: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రొంపేడు గ్రామానికి చెందిన వాంకుడోతు రాంసింగ్(55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జబ్బు నయం కాదని తెలిసి, జీవితం మీద విరక్తి చెంది ఇంటి వద్దనే పురుగుల మందు తాగడు. కుటుంబ సభ్యులు గమనించి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం

చర్ల: మండలంలోని కొత్తపల్లిలోని ఇసుక సొసైటీలో రైజింగ్ కాంట్రాక్టర్ల మధ్య వివాదం నెలకొని శుక్రవారం ఓ కాంట్రాక్టర్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. కొత్తపల్లిలో గిరిజన మహిళా ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్ట్ పరస్పర సహాయ సహకార సంఘం నిర్వహణలో ఉంది. కాగా దీని నిర్వహణకు రూ.70 లక్షలు పెట్టుబడి పెడితే తనకు అన్యాయం చేశారని, తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ ఏపీలోని భీమవరానికి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. అది వైరల్‌గా మారింది. శ్రీనివాసరావు పేర్కొన్నట్లుగానే ఇసుక క్వారీ వద్దకు వెళ్లి నిద్రమాత్రలు మింగాడు. అపస్మారక స్థితికి చేరుకోగా, ఆయనను అక్కడి నుంచి కొందరు భద్రాచలం వైద్యశాలకు తరలించారు. ఈ వ్యవహారంపై పోలీసులను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. వారు అందుబాటులోకి రాలేదు.